లింక్ రోడ్డు విస్తరణకు ఆందోళన



ఆందోళన చేస్తున్న పబ్బులేటిపల్లి వాసులు

సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలోకి వెళ్లే లింక్ రోడ్డును విస్తరించాలని కోరుతూ మంగళవారం గ్రామస్తులు సర్పంచ్ ఆదెయ్య ఆధ్వర్యంలో మైదుకూరు– సింగరాయకొండ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్ తమ గ్రామంలోకి వచ్చే లింకురోడ్డును చిన్నదిగా ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ రోడ్డును వెడల్పు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. తమ గ్రామం నుంచి నిత్యం ఎంతో మంది విద్యార్థులు మండల కేంద్రమైన సీతారామపురం వెళ్తుంటారని, వారి శ్రేయస్సురీత్యా జంక్షన్ పాయింట్‌లో విద్యుద్దీపాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. – సీతారామపురం

పిచ్చిమొక్కలకు ఆవాసంగా..

పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణం పిచ్చిమొక్కలకు ఆవాసంగా మారింది. వివిధ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. కార్యాలయ ఆవరణలోనే ఆ శాఖకు సంబంధించిన సెల్ టవర్‌ను ఏర్పాటు చేశారు. అయితే చాలా కాలంగా అధికారులెవరూ పర్యవేక్షణ చేయడం లేదు. ఫలితంగా మొక్కలు విపరీతంగా పెరిగిపోయి ఉన్నాయి. దీంతో పాటు విషపురుగులు సంచరిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయ ప్రాంగణంలోని సెల్ టవర్ ప్రాంతం శుభ్రంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.
– ఉదయగిరి రూరల్



బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

అధ్వానంగా జీపుట్రాక్



28వ కిలోమీటర్ సమీపంలో గుంతలమయంగా జీపుట్రాక్

సోమశిల ఉత్తరకాలువ జీపుట్రాక్ అధ్వానంగా తయారైంది. ఉత్తర కాలువ నిర్మాణ సమయంలో పర్యవేక్షణ కోసం ఇరిగేషన్ అధికారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా జీపు ట్రాక్‌ను నిర్మించారు. తొలిదశలో 0 పాయింట్ నుంచి 54వ కిలోమీటరు వరకు నిర్మించిన జీపు ట్రాక్ కాలానుగుణంగా రైతులు తమ భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు ఉపయుక్తంగా మారింది. ఈ మార్గంలోనే కాలువకు ఇరువైపులా భూములు కలిగిన రైతుల నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఏడాది కాలంగా జీపు ట్రాక్‌కు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లకంప చెట్లు సమీప భూముల్లోకి వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగించే రైతులకు శాపంగా మారాయి. జీపు ట్రాక్‌పై లోతైన గుంతలు ఏర్పడడంతో వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు, ఆటోల్లో కూలీలను తీసుకెళ్లేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు ఉపక్రమించేలోగా జీపు ట్రాక్‌పై జంగిల్‌క్లియరెన్స్ చేపట్టి గుంతలను పూడ్చాలని రైతులు కోరుతున్నారు. –ఆత్మకూరురూరల్

క్లుప్తంగా

యోగాపై ప్రత్యేక సమావేశం నేడు

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సర్పంచ్‌లకు స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఉదయం 11 గంటలకు యోగాపై ప్రత్యేక సమావేశం జరుగుతుందని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. జూన్ 10వ తేదీన జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు నాలుగు కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. అందులో ఉదయగిరి కూడా ఉందన్నారు. ఈ కేంద్రంలో యోగా ఆవశ్యకత, ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. మండలం నుంచి ముగ్గురు పీఈటీలను ఎంపిక చేశామన్నారు. కాగా మండలంలో ఉదయగిరి టౌన్, బిజ్జంపల్లి, కృష్ణంపల్లి లేదా గడ్డంవారిపల్లెలను ఎంపిక చేస్తామని, అందులో యోగాపై అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మతల్లి

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం జలాశయ సమీపంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో మంగళవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. గోత్రనామాలతో అర్చనలు చేయించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విజయకుమార్ సంతాప సభ నేడు

ఉదయగిరి: జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు, నెల్లూరు వైద్యశాల ఫౌండర్ డాక్టర్ విజయకుమార్ పదో వర్ధంతి సంతాపసభను పట్టణంలోని వేణు నర్సింగ్ హోమ్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జేవీవీ ఉదయగిరి మండలాధ్యక్షుడు షేక్.గాజుల మున్నా, కార్యదర్శి మహమ్మద్‌అలీ, కోశాధికారి సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేవీవీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు పాల్గొనాలన్నారు.

పొదుపు సభ్యులతో సమావేశం

సంగం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు ఏపీఎం రవిశంకర్‌రెడ్డి పొదుపు సభ్యులతో మంగళవారం ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాల రికవరీ వంద శాతం ఉండాలని సూచించారు. అదేవిధంగా రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం కింద రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొదుపు మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నామని వివరించారు.

మెగా కంటి వైద్యశిబిరం రేపు

సోమశిల: సీపీఎం ఆధ్వర్యంలో జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా అనంతసాగరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారిచే గురువారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మంగళవారం తెలిపారు. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వారికి ఈ వైద్యశిబిరంలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని తెలియజేశారు. అవసరమైతే ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో బెల్టు జోరు

- టీడీపీ నేతలకు ఆదాయ వనరు
- కాదని ఎవరైనా అమ్మితే కేసులే..
- ఎక్సైజ్ పోలీసులే దగ్గరుండి జరిపిస్తున్న వైనం



హసనాపురంలోని కూల్‌డ్రింక్ షాపులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లు



అనుమసముద్రంపేట: నూతన మద్యం పాలసీ తమ్ముళ్లకు ఎక్కడ లేని ఆదాయ వనరుగా మారింది. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలను జోరుగా కొనసాగిస్తోంది. గతంలో ఉన్న ధరల కంటే అధికంగా విక్రయించడమే కాక ఒక్కో గ్రామంలో రెండు నుంచి ఐదు బెల్ట్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. దీనికి తోడు టీడీపీ నాయకులు చెప్పిన వారికే బెల్ట్ అమ్మకాలను అప్పగించారు. ఎవరైనా బయట వారు బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మండల పరిధిలో..

ఏఎస్‌పేట మండల పరిధిలో మూడు మద్యం దుకాణాలు ఉండగా వీటి పరిధిలో దాదాపు 70 బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరంతా టీడీపీకి చెందిన వారే. హసనాపురం మద్యం షాపు పరిధిలో ఓ టీడీపీ నాయకుడు చక్రం తిప్పుతూ తమ వాళ్లే బెల్ట్ అమ్మాలంటూ హుకూం జారీ చేశాడు. అక్కడ ఉన్న మద్యం షాపు సైతం టీడీపీ నాయకుడిది కావడం విశేషం. ఈ షాపు పరిధిలో చుట్టుపక్కల గ్రామాలకు మద్యాన్ని తరలించి బెల్ట్ దుకాణాల పేరుతో అందజేస్తున్నారు. రూ.160 విలువ చేసే క్వార్టర్ బాటిల్‌ను రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. దీంతో మద్యం ప్రియులు లబోదిబోమంటున్నారు. ఇతరులు ఎవరైనా మద్యం విక్రయాలు చేస్తుంటే వారిని టీడీపీ నాయకులు పోలీసులకు పట్టించి కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో కొంత మంది చేసేదేమీ లేక మిన్నకుండిపోతున్నారు.

లంచాల మత్తులో ఎక్సైజ్ శాఖ

బెల్ట్ దుకాణాలను నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు లంచాల మాయలో పడి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. బెల్ట్ దుకాణాలపై దాడులు చేయాల్సిన ఎక్సైజ్ పోలీసులు నెలకో రేటు మాట్లాడుకుని మద్యం విక్రయాలకు సహకరిస్తున్నారని స్వయంగా బెల్ట్ దుకాణదారులే చెబుతున్నారు. ఒక్కో బెల్ట్ దుకాణానికి సంబంధించి నెలకు రూ.3 వేలను ఎక్సైజ్ పోలీసులకు లంచాల రూపంలో ఇస్తున్నామని అంటున్నారు. టీడీపీ నాయకుల చేతుల్లో ఎక్సైజ్ శాఖ పోలీసులు సైతం కీలుబొమ్మలుగా మారారు. టీడీపీ నాయకులు చెప్పిన వారికే మద్యం సప్లయ్‌ను ఎక్సైజ్ శాఖ ద్వారానే జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ సీఐనే నేరుగా కానిస్టేబుల్‌ను పంపిస్తూ నెల మామూళ్లను వసూలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఆమె పనితీరు సక్రమంగా లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు. ఎవరికి మద్యం అమ్ముకునేందుకు అనుమతులు లేవు. ఆయా గ్రామాల్లో మా శాఖ సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తాం.
– వెంకటరమణమ్మ, ఎక్సైజ్ సీఐ

యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై అవగాహన

వింజమూరు(ఉదయగిరి): యోగాంధ్ర రిజిస్ట్రేషన్లపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించి యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేపట్టాలని సూచించారు. మండలంలో 16,876 మందిని రిజిస్టర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రెండు వేల మంది మాత్రమే నమోదైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ గోపి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

- **ఆత్మకూరురూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ డేవిడ్, పరిపాలనాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్లు తిరుపతయ్య, సురేష్, సందానీ, షరీఫ్ పాల్గొని యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. క్షేత్రస్థాయిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.
- **అనుమసముద్రంపేట:** అంతర్జాతీయ యోగా డేను ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించాలని ఏఎస్‌పేట ఎంపీడీఓ ప్రసన్నకుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

కావలి డిపోకు రాష్ట్రస్థాయి అవార్డు

కావలి(జలదంకి): కావలి డిపోకు రాష్ట్రస్థాయి ఇంధన సామర్థ్య అవార్డు వరించింది. దీనిని కావలి డిపో గ్యారేజ్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి మురళీబాబు కావలి డీఎం రాపూరు శ్రీనివాసులుకు మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా మురళీబాబు మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గానూ కావలి డిపోకు నిర్దేశించిన ఇంధన పొదుపు లక్ష్యాన్ని సాధించి అవార్డును అందుకుందన్నారు. ఈ అవార్డు సాధనలో డిపో మేనేజర్, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఖాజా మొహిద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, ట్రాఫిక్, గ్యారెజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి

సోమశిల: సైబర్ నేరాలపై మహిళలు, బాలికలు జాగ్రత్తగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ మోసాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని, ఆడపిల్లలు మొబైల్ ఫోన్ ఉపయోగించడంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ మోసం జరిగిందని తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ వర్కర్స్ సుప్రజ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జేసీబీ స్వాధీనం



సోమశిల: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న జేసీబీని పోలీసులు స్వాధీనం తీసుకున్న ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. అనంతసాగరం మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లి ప్రభుత్వ భూముల నుంచి మినగల్లు, రేవూరు గ్రామాలకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ క్రమంలో అక్రమార్కులు ట్రాక్టర్లను అక్కడి నుంచి తీసుకెళ్లిపోగా జేసీబీని అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా అర్ధరాత్రులు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ జేసీబీ రేవూరుకు చెందిందని సమాచారం.

రేషన్ కాటాలకు మరమ్మతులు

ఆత్మకూరురూరల్: మండలంలోని రేషన్ షాపుల డీలర్లు తమ దుకాణాల్లో తూకం వేసే కాటాలను మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్‌షాపుల్లోనే ప్రజలకు నిత్యావసరాలు అందించాలని ప్రభుత్వాదేశాలు వచ్చిన నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మూగజీవాన్ని కాపాడిన స్థానికులు



జేసీబీ సాయంతో గేదెను బయటకు తీస్తున్న స్థానికులు

సంగం: మురుగు కాలువలో పడిన మూగజీవాన్ని స్థానికులు బయటకు తీసి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన మండల కేంద్రమైన సంగంలో మంగళవారం చోటుచేసుకుంది. బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఓ డ్రెయినేజీ కాలువలో ప్రమాదవశాత్తు ఓ గేదె పడిపోయింది. పెద్దగా అరుస్తుండడంతో స్థానికులు గుర్తించి జేసీబీ సాయంతో ఆ గేదెను బయటకు తీశారు. మురుగును తొలగించేందుకు తీసిన రాళ్లను అలాగే వదిలేయడంతో ఇలా గేదె పడిపోయిందని, అధికారులు స్పందించి కాలువపై మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వామపక్షాల ర్యాలీ

జలదంకి: జలదంకిలో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో సమైక్యతా యాత్రను మంగళవారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి గట్టుపల్లి రోడ్డు కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, ఆంతోనీబాబు, రాధాకృష్ణ, గడ్డం మాల్యాద్రిరెడ్డి, బత్తల నరసింహ, దేవరకొండ బాలయ్య, కుట్టుబోయిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రెడ్డి

సంగం: గ్రామాల్లో చెత్త సేకరణపై దృష్టి సారించాలని, స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సంగంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ జిల్లాలో 720 పంచాయతీలకు 200 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణ విజయవంతంగా జరుగుతోందన్నారు. చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నామని తెలిపారు. 60 శాతం మంది ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. నిధులు అవకతవకలు జరుగుతున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌ను ఏర్పాటు చేసిందని, ఈ క్రమంలో పంచాయతీలో లావాదేవీలు ఈ యాప్‌లోనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పీఆర్–1 యాప్ ద్వారా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో డీఎల్ఈఓ నయీంతాజ్ హసన్, ఈఓపీఆర్డీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక సోమవారం అదృశ్యమైన నేపథ్యంలో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలిసిన సీఐ వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. వింజమూరు బస్టాండ్ సెంటర్‌లోని ఓ చిల్లర దుకాణంలో నెలవారీ జీతంపై ఆ బాలిక పనిచేస్తోంది. సోమవారం ఉదయం దుకాణానికి వచ్చిన బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్లి వస్తానని యజమానికి చెప్పి వెళ్లింది. మధ్యాహ్నం వరకు కూడా తిరిగి రాకపోవడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలంలోని పెద్దబ్బీపురం గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన మలిశెట్టి దశరథరామమూర్తి, సతీష్, మలిశెట్టి వారి కుటుంబాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కందుకూరికి నివాళి



సోమశిల : మండల కేంద్రమైన అనంతసాగరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో తెలుగు కథలను చదవడం, చెప్పించడం వంటి కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పరాంకుశం భానుప్రకాష్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా చేస్తున్న సిబ్బంది



కొండాపురం ఎంపీడీఓ కార్యాలయంలో..

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. 'యోగాంధ్ర– 2025'లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో యోగా సాధనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించారు. మున్సిపల్, మెప్మా సిబ్బంది యోగా సాధనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏటా జూన్ 21న యోగాడేగా పరిగణించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

- **కొండాపురం:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగా కార్యక్రమంపై ఎంపీడీఓ ఆదినారాయణ, వైద్యారోగ్య సిబ్బంది, మండలస్థాయి అధికారులు, సచివాలయం, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలాల్లో ప్రతి మూడు సచివాలయాలకు సంబంధించి ఆయా సచివాలయ పరిధిలో, స్థానిక పాఠశాలలో యోగాపై శిక్షణా నిర్వహించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అలాగే మరుసటి రోజు ప్రజలకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఆయుష్మాన్ భారత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కావలి (జలదంకి): జిల్లాలో పదో తరగతితో ప్రతిభ చూపిన పేద రెడ్డి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కోసం ఈనెల 30వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు చేసుకోవాలని రెడ్డి ఫౌండేషన్ సభ్యులు కూరపాటి వెంకటకృష్ణారెడ్డి, బత్తిన ప్రభాకర్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి మంగళవారం తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు కావలి పట్టణంలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 93908 44319 నంబర్‌కు వాట్సాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

యాదవ విద్యార్థులకు..

కలిగిరి: ప్రస్తుత పదో తరగతి ఫలితాల్లో 470 మార్కులకుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామని జిల్లా యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి బి.మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రవి మంగళవారం తెలిపారు. నెల్లూరులోని యాదవ భవన్‌లో జూన్ 1వ తేదీన ప్రతిభా పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా, కందుకూరు డివిజన్ పరిధిలోని యాదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 94920 07309, 94906 62651 నంబర్లను సంప్రదించాలని సూచించారు.